

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
సోమవారం 22 ఏప్రిల్ 2024



కార్మికుల కోసం పోరాడేది ఐఎన్‌టీయూసీ
- సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్
8లో..

రామగుండంలో అనుమతులు లేకుండానే భారీ కట్టడాలు
8లో..

'పెద్దపల్లి'లో త్రిముఖ పోరు



- పూర్వవైభవం చాటుకునేందుకు కాంగ్రెస్ ఆరాటం
- హ్యాట్రిక్ సాధించేందుకు బీఆర్‌ఎస్ తహతహ
- ఖాతా తెరిచేందుకు ఉవ్విళ్లూరుతున్న బీజేపీ
- కీలకం కానున్న సింగరేణి కార్మికులు, దళితుల ఓట్లు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో ట్రయాంగిల్ ఫైట్ నడవబోతున్నది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థుల మధ్యే ప్రధానంగా పోటీ జరగనున్నది. పదేళ్లుగా ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ ఈసారి విజయ బావుటా ఎగురవేసి పట్టు నిలుపుకోవాలని ప్రయత్నిస్తున్నది. వరుసగా మూడోసారి గెలుపొంది హ్యాట్రిక్ సాధించాలని బీఆర్‌ఎస్ నేతలు భావిస్తున్నారు. ఎలాగైనా ఈసారి ఖాతా తెరవాలని బీజేపీ నాయకులు ఉవ్విళ్లూరుతున్నారు. మూడు పార్టీల నుంచి బలమైన అభ్యర్థులనే రంగంలోకి దింపడంతో పోటీ రసవత్తరంగా మారనున్నది.

ఈ ఎన్నికల్లో సింగరేణి కార్మికులు, వారి కుటుంబాలు, దళితుల ఓట్లు కీలకంగా మారనున్నాయి. నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుండగా, ఈనెల 25వ తేదీ నాటి నుంచి ముగియనుండడంతో ఆ తర్వాత ఎన్నికల ప్రచారం మరింత ఊపందుకోనున్నది. కాంగ్రెస్ పార్టీ నుంచి మాజీ కేంద్ర మంత్రి, దివంగత గడ్డం వెంకటస్వామి మనవడు, మాజీ ఎంపీ డాక్టర్ వివేక్ తనయుడు గడ్డం వంశీకృష్ణ పోటీ చేస్తున్నారు. బీఆర్‌ఎస్ నుంచి మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు అయిన కొప్పుల ఈశ్వర్ పోటీ పడుతున్నారు. బీజేపీ నుంచి గోమాసే శ్రీనివాస్ పోటీ చేస్తున్నారు.

పూర్వ వైభవం కోసం కాంగ్రెస్..



గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో గెలుపొంది క్లీన్ స్వీప్ చేసిన కాంగ్రెస్ పార్టీ మరో విజయాన్ని తన ఖాతాలో నమోదు చేసుకుని పూర్వ వైభవాన్ని చాటుకోవాలని ఆరాట పడుతున్నది. పార్టీ టికెట్ కోసం అనేక మంది పోటీ పడినప్పటికీ, గడ్డం వంశీకృష్ణకే టికెట్ దక్కింది. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలు, అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్నింటిని అమల్లోకి తీసుకవచ్చింది. ఇప్పటివరకు అమలుచేస్తున్న పథకాలతో పాటు పార్లమెంట్ ఎన్నికలు పూర్తయిన తర్వాత అమలు చేసే పథకాల గురించి కాంగ్రెస్ పార్టీ నాయకులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. అలాగే నాలుగు పర్యాయాలుగా పెద్దపల్లి ఎంపీగా, కేంద్ర మంత్రిగా గడ్డం వెంకటస్వామి, ఒక దఫా ఎంపీగా గడ్డం వివేక్ చేసిన సేవలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరిస్తున్నారు.

ప్రధానంగా సింగరేణి సంస్థను కాపాడేందుకు కేంద్ర మంత్రిగా ఉన్న వెంకటస్వామి కేంద్రం నుంచి సుమారు 450 కోట్ల రూపాయల మార టోరియం ఇప్పించిన అంశంతో పాటు, పదవీ విరమణ పొందిన కార్మికులకు పింఛన్ సౌకర్యం కల్పించిన తీరు గురించి ప్రధానంగా ప్రజల్లోకి తీసుక వెళుతున్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నాడు వెంకటస్వామి, మలి విడతలో వివేక్ చేసిన ఉద్యమం గురించి వివరిస్తూ వస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాల కల్పన, కార్మికులకు కోటి రూపాయల బీమా, కాంట్రాక్టు కార్మికులకు 25 లక్షల రూపాయల వరకు కల్పించిన బీమా గురించి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

హ్యాట్రిక్ సాధించేందుకు బీఆర్‌ఎస్..



తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత రెండుసార్లు 2014, 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి బాల్క సుమన్, బొర్లకుంట వెంకటేశ్ నేత గెలుపొందారు. మూడోసారి కూడా గెలుపొంది హ్యాట్రిక్ సాధించాలని తహతహ లాడుతున్నారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభ్యర్థులు ఓటమి చెందినప్పటికీ, పార్టీకి ప్రజల్లో పట్టు సడల లేదు. సింగరేణి కార్మికుడిగా పని చేసి రాజకీయా ల్లోకి వచ్చి వరుసగా ఆరుసార్లు ఎమ్మెల్యే గెలుపొంది, ఒకసారి ప్రభుత్వ విప్‌గా, ఒకసారి మంత్రిగా పనిచేసిన కొప్పుల ఈశ్వర్‌ను పార్టీ అభ్యర్థిగా రంగంలోకి దింపింది. అభ్యర్థి ఎంపిక విషయంలో అధినేత కేసీఆర్ ఆచితూచి అడుగు వేశారు.

తెలంగాణ సాధించిన పార్టీగా, పదేళ్ల పాలనలో రాష్ట్రంలో, ఈ ప్రాంతంలో చేసిన అభివృద్ధి, అమలుచేసిన సంక్షేమ పథకాల గురించి గుర్తుచేస్తూ ప్రజల్లోకి వెళుతున్నారు. ప్రధానంగా స్థానికులకే అవకాశం ఇవ్వాలని, స్థానికంగా ప్రజల మధ్యనే ఉండే వారినే గెలిపించాలనే అంశాన్ని ప్రధాన ప్రచార అస్త్రంగా మలచుకుని అభ్యర్థి ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు ముమ్మర ప్రచారం చేస్తున్నారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, అభివృద్ధి గురించి కూడా కార్మికులకు వివరిస్తున్నారు. వంద రోజుల్లోనే అమలుచేస్తామని ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయక పోవడంపై ప్రచారం చేస్తున్నారు. అక్కడక్కడ పార్టీ క్యాడర్ పార్టీని వీడుతున్నప్పటికీ, క్షేత్ర స్థాయిలో ఉన్న కార్యకర్తల బలంతో ముందుకు సాగుతున్నారు.

ఖాతా తెరిచేందుకు బీజేపీ..



పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం ఏర్పాటైన నాటి నుంచి ఇప్పటి వరకు ఖాతా తెరవని బీజేపీ ఈసారి కాషాయ జెండా ఎగుర వేయాలని ఉవ్విళ్లూరుతున్నది. పార్టీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీకి చెందిన గోమాసే శ్రీనివాస్‌ను రంగంలోకి దింపింది. 2009లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి సుమారు 49వేల ఓట్ల మెజారిటీతో ఓటమి చెందిన గోమాసే శ్రీనివాస్ నియోజకవర్గ ప్రజలకు సుపరిచితులే. విశేష రాజకీయ అనుభవం ఉండడం, ప్రజలను ఆకట్టుకునే వాగ్ధాటితో శ్రీనివాస్ ముందుకు సాగుతున్నారు.

పదేళ్ల నరేంద్ర మోదీ పాలన, అయోధ్యలో రామాలయ నిర్మాణాలను ప్రచారాస్త్రాలుగా మల్చుకుని ప్రచారం నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలో బీజేపీకి అంతగా క్యాడర్ లేకపోయినా పట్టణ ప్రాంతాల్లో పార్టీకి మంచి పట్టు ఉంది. నరేంద్ర మోదీ మానియాతో యువకులు బీజేపీ పట్ల అనుకూలంగా ఉండడంతో వారిని ఆకర్షించేందుకు ముమ్మర ప్రచారం చేస్తున్నారు. ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ చేస్తామని ప్రధాని మోదీ ప్రకటించిన అంశాన్ని బలంగా తీసుకవెళుతున్నారు. మొత్తంగా పెద్దపల్లిలో మూడు ప్రధాన పార్టీల మధ్య పోరు రసవత్తరంగా సాగనున్నది.

మల్లన్న ఆలయంలో భక్తుల సందడి



మల్లన్న ఆలయంలో పట్నాలు వేస్తున్న ఒగ్గు పూజారులు

ఓదెల, ఏప్రిల్ 21 : మండల కేంద్రంలోని భ్రమరాంభ శ్రీ మల్లికార్జునస్వామి క్షేత్రంలో ఆదివారం భక్తులు సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయంలో భ్రమరాంభ మల్లికార్జునస్వామిని దర్శించుకొని బోనాలను సమర్పించారు. అలాగే ఆలయంలో కోడెలతో మొక్కులు చెల్లించారు. కుటుంబాల వారిగా తరలివచ్చిన భక్తులు ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించి మొక్కులను సమర్పించారు. ఓవైపు తీవ్రమైన ఎండ, మరోపక్క వరికోతలు ఉండటంతో జాతరకు భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గింది. రుతు పవనాలు వస్తే గాని ఆలయంలో భక్తుల సంఖ్య పెరిగే పరిస్థితి లేదు.

రామగుండంలో మైనర్లకు మద్యం విక్రయాలు

- నిబంధనలను పట్టించుకోని నిర్వాహకులు

కోల్‌సిటీ, ఏప్రిల్ 21: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పలు దుకాణాలు, బార్లలో మైనర్లకు మద్యం విక్రయలు జరుపుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పోలీస్ శాఖ గంజాయి అమ్మకాలపై కఠినంగా వ్యవహరిస్తుండడంతో దానికి అలవాటు పడిన కొందరు మైనర్లు మత్తుకు ప్రత్యామ్నాయలు వెతుక్కుంటున్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్ పరీక్షలు ముగియడం, వేసవి సెలవు కావడంతో యువకులు ఇండ్ల వద్దే ఉంటున్నారు. స్నేహితులతో బయటకు వెళుతున్నామంటూ తల్లిదండ్రులతో చెప్పి వేడుకల పేర బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్నారు. కొందరైతే ఏకంగా వైన్‌షాపుల ముందే పలువురు మైనర్లల మద్యం సేవిస్తున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. గోదావరిఖని పట్టణంలోని మెయిన్ రోడ్డులో గల ఒక మద్యం దుకాణం ముందు ఫుట్‌పాత్‌పైనే మైనర్లు బీర్లు తాగుతుండడం గమనార్హం. 21సంవత్సరాలలోపు వారికి మద్యం విక్రయాలు జరుపవద్దని, జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం నుంచి ఖచ్చితమైన ఆదేశాలు ఉన్నాయి. అయినా వైన్స్, బార్లలో వీరికి మద్యం విక్రయిస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

21ఏళ్లలోపు వారికి మద్యం విక్రయిస్తే కేసులు..

- మంగ, రామగుండం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్

నిబంధనల ప్రకారం 21ఏళ్లలోపు వారికి మద్యం విక్రయాలు జరిపేందుకు వీలు లేదు. ఒక వేళ వైన్స్, బార్లలో 21ఏళ్లలోపు వారికి మద్యం విక్రయాలు జరిపితే ఆ షాపులపై కేసులు నమోదు చేస్తాం.

సింగరేణి కార్మికుల సొంతింటి కల నెరవేరుస్తాం

- కొత్త గనుల తవ్వకాలు చేపడుతాం - పదేళ్లలో బీఆర్‌ఎస్, బీజేపీ కార్మికులకు చేసిందేమి లేదు - మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు



హాజరైన నాయకులు, కార్యకర్తలు

గోదావరిఖని, ఏప్రిల్ 21: సింగరేణి కార్మికులకు సొంతింటి కల నెరవేరుస్తామని, తెలంగాణ కొంగు బంగారమైన సింగరేణిలో త్వరలోనే కొత్త గనుల తవ్వకాలు చేపడుతామని రాష్ట్ర పరిశ్రమల, ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఆదివారం గోదావరిఖనిలో జరిగిన పెద్దపల్లి పార్లమెంట్ సన్నాక సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్, బీజేపీ కార్మికులకు చేసిందేమి లేదని, కార్మికుల సమస్యలు పరిష్కరించిన పాపానపోలేదని ఆయన విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో డిపెండెంట్ ఉద్యోగాల కోసం లక్షల రూపాయలు కార్మికుల నుంచి వసూలు చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత లంచాలు లేకుండా డిపెండెంట్ ఉద్యోగాలు పార దర్శకంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వైఎస్ఆర్ రాజశేఖర్‌రెడ్డి హయంలో 17000 కట్టడాలకు పట్టాలు ఇచ్చామని, మిగిలిన వారికి రామగుండం వేదికగా త్వరలోనే పట్టాలు ఇప్పించనున్నట్టు, అంతేకాకుండా కార్మికులకు సొంతింటి కలను రామగుండం నుంచే నెరవేర్చనున్నట్టు పేర్కొన్నారు. మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆధ్వర్యంలో ఈ రెండు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు మంత్రి తెలిపారు. సింగరేణి గని ప్రమాదంలో మృతిచెందిన కార్మిక కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియాను కాంగ్రెస్ ప్రభుత్వమే ఇచ్చిందని, సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రమాదవశాత్తు మృతిచెందిన కాంట్రాక్టు కార్మిక కుటుంబాలకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇప్పించిన ఘనత కూడా కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను వంద రోజుల్లోనే అమలు చేసి చూపించామని, రాష్ట్రంలో నిరుద్యోగాన్ని రూపు మాపడం కోసం ఐటీ పార్కులను ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్టు చెప్పారు. సింగరేణిలో పదవీ విరమణ పొందిన కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని, వారికి సూపర్‌స్పెషాలిటీ వైద్యం అందించేందుకు చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం రూ.10లక్షలకు పెంచడం వల్ల ఎంతో మందికి లబ్ధి చేకూరు తుందని చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కోల్‌బెల్ట్‌లో ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీకి బుద్ధి చెప్పారని, ఈ ఎన్నికల్లో కూడా బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో కార్మికులు గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్‌రావు,రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ, మేయర్ బంగి అనీల్ కుమార్, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్, నాయకులు బాబర్ సలీంపాషా, నర్సింహారెడ్డి, వడ్డేపల్లి దాస్, వికాస్, టైసన్ శ్రీను, వివిధ ఏరియాల ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

వేసవి ప్రణాళిక పనుల టెండర్ల వివాదం

- బైహ్యాండ్ పనులు చూడకుండానే ఖరారు
- కాంట్రాక్టర్ల ఫిర్యాదులు.. రాజీతో వెనక్కి..
- మారని రామగుండం నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం తీరు

కోల్‌సిటీ, ఏప్రిల్ 21: రామగుండం నగరపాలక సంస్థలో ఇంజనీరింగ్ విభాగం తీరు మారడం లేదు. ఇప్పటికే అధికారులు కొందరు కాంట్రాక్టర్లను వెనకేసుకుని రావడం, కొందరికి అనుకూలంగా రికార్డుల్లో తప్పులు చేయడంతో ఇతర కాంట్రాక్టర్లు బ్లాక్ మెయిలింగ్‌కు దిగుతున్నారు. ఒకరిని మించి ఒకరు కాంట్రాక్టర్లు అధికారులను బూతులు తిట్టడం సర్వసాధారణమైంది. ఇంత జరుగుతున్నా రామగుండంలో ఇంజనీరింగ్ విభాగంలో ఇంకా కాంట్రాక్టర్ల పక్షపాత ధోరణి మారడం లేదనే విమర్శలున్నాయి. ఇటీవల వేసవి నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు రూ.60లక్షల పనులకు నిర్వహించిన టెండర్ల ఖరారుకు సంబంధించి వివాదం మొదలైంది. రూ.60 లక్షలల్లో రూ.10లక్షల ట్యాంకర్లతో నీటి సరఫరా, రూ.10లక్షల బోర్‌వెల్ మెటీరియల్, లికేజీలు అరికట్టడానికి సంబంధించి రూ.20లక్షల రెండు పనులు, పైప్‌లైన్ల మార్పు, లీకేజీలు అరికట్టడానికి సంబంధించి ఒక పని, వాల్వ్‌లు సరఫరా, రీప్లేస్‌కు సంబంధించి రూ.8.3లక్షలకు మరో పనికి టెండర్ నిర్వహించారు. సాధారణంగా టెక్నికల్ బిడ్ పరిశీలనలోనే టెండర్లు దాఖలు చేసిన కాంట్రాక్టర్ల బై హ్యాండ్ వర్క్స్‌ను పరిశీలిస్తారు. ఇప్పటికే పలు ప్రభుత్వ శాఖల్లో పనులు పొంది పూర్తి చేయని కాంట్రాక్టర్లకు నిబంధనల ప్రకారం టెండర్లు ఇవ్వరు. కానీ రామగుండంలో బై హ్యాండ్ పనుల పరిశీలన అడ్డం పెట్టి గోల్‌మాలు జరుగుతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వాల్వ్‌లకు సంబంధించి ఒక పనికి నలుగురు కాంట్రాక్టర్లు టెండర్లు దాఖలు చేయగా ఇద్దరు కాంట్రాక్టర్లకు బైహ్యాండ్ పనుల పేర రిజక్ట్ చేశారు. మరో ఇద్దరు కాంట్రాక్టర్ల టెండర్లను పరిశీలన చేశారు. దీనిలో ఒక కాంట్రాక్టర్‌కు మరో ప్రభుత్వశాఖలో బైహ్యాండ్ వర్క్ ఉందని, దీనిని చూపలేదని మరో కాంట్రాక్టర్ ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ఒక కాంట్రాక్టర్ తాను విజిలెన్స్‌కు పోతానని టెండర్‌ను తెరవాలంటూ అధికారులపై ఒత్తిడి తెచ్చినట్టు తెలిసింది. ఇన్‌వార్డ్‌లో ఫిర్యాదు చేసిన తరువాత కాంట్రాక్టర్ల మధ్య లావాదేవీల చర్చలు జరిగి ఇంజనీరింగ్ అధికారుల జోక్యంతో వాపసు తీసుకున్నట్టు తెలుస్తుంది. ఈ ఒక్క టెండర్‌లో వివాదం మరో రెండు పనులపై పడింది. ఈ టెండర్ల వ్యవహారం కార్పొరేషన్‌లో ఇప్పటికే వివాదాన్ని రేపుతుంది. టెండర్ దాఖలైన మూడు పనులు సింగిల్ టెండర్‌పై దాఖలయ్యాయి.

ఇంజనీరింగ్ అధికారుల వ్యవహార శైలితో ఇప్పటికే కార్పొరేషన్‌లో ఆ విభాగం ఉనికికే ప్రమాదం ఏర్పడింది. విజిలెన్స్ కార్యాలయం చుట్టూ ఫైళ్లు పట్టుకుని తిరుగుతున్న పరిస్థితి. ఇలాంటి సందర్భాల్లో సైతం ఇంజనీరింగ్ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తుండడం తీవ్ర చర్చనీయాంశం అవుతోంది.

శిథిలావస్థలో సుల్తానాబాద్ ఆర్టీసీ బస్టాండ్

- భయాందోళనలో ప్రయాణికులు - నాలుగు దశాబ్దాల క్రితం నిర్మాణం - పట్టించుకోని అధికారులు



సుల్తానాబాద్ ఆర్టీసీ బస్టాండ్



పైకప్పు కూలుతున్న చోట ఏర్పాటు చేసిన కర్రలు

సుల్తానాబాద్, ఏప్రిల్ 21: నిత్యం వందలాది మంది ప్రయాణికులతో రద్దీగా ఉండే సుల్తానాబాద్ ఆర్టీసీ బస్‌స్టేషన్ శిథిలావస్థకు చేరుకుంది. దీంతో బస్టాండ్‌లో ప్రయాణికులకు భద్రత కరువైంది. బస్టాండ్ పైకప్పు పెచ్చులూడి పడుతుండడంతో బస్టాండ్‌లో నిలబడేందుకు, కూర్చోవడానికి ప్రయాణికులు భయపడుతున్నారు. ఏ సమయంలో తమపై పైకప్పు పెచ్చులు ఊడిపడుతాయోనని బస్టాండ్‌లో ఉన్నంత సేపు భయం వారిని వెంటాడుతోంది.

1986లో ప్రారంభం..

ఉమ్మడి జిల్లా ఉన్న సందర్భంలో సుల్తానాబాద్ ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం ఆవశ్యకతను సుల్తానాబాద్‌కు చెందిన బిరుదు రాజమల్లు అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆనాటి ప్రభుత్వ పెద్దలు నిధులు మంజూరుచేయించి 25 ఏప్రిల్ 1986లో బస్‌స్టేషన్‌ను ఆనాటి రవాణా శాఖ మంత్రి జానారెడ్డి, జిల్లాకు చెందిన రాష్ట్ర న్యాయశాఖ మంత్రి రాజేషంగౌడ్‌లు ప్రారంభించారు. దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం ఆనాటి అవసరాల నిమిత్తం రద్దీని దృష్టిలో పెట్టుకుని నిర్మించిన బస్టాండ్ ప్రస్తుతం ఏమాత్రం సరిపోవడం లేదు. పెరిగిన ప్రయాణికులు, పెరిగిన బస్సుల రాకపోకలతో ఈ బస్టాండ్ ఏమాత్రం సరిపోవడం లేదు. బస్టాండ్‌ను విస్తరించాల్సిన అవసరం ఉంది. మరిన్ని ప్లాట్ ఫారమ్‌లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

అడ్డంగా టేలాలు..

సుల్తానాబాద్ బస్టాండ్ ప్రస్తుత రాజీవ్ రహదారికి పూర్తి దిగువను ఉంది. దాంతో బస్సుల రాకపోకల సందర్భంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా బస్సులు బస్టాండ్ లోపలకు వెళుతున్నపుడు ఎదురుగా వస్తున్న వాహనాలు అదుపుతప్పి బస్సులను ఢీకొంటున్నాయి. అలాగే బస్సులు బస్టాండ్ నుంచి తిరిగి రాజీవ్‌రహదారిని ఎక్కేటప్పుడు కూడా లారీలు,ఇతర వాహనాలు ప్రమాదాలకు గురవుతూ ప్రయాణికులు గాయపడుతున్న సంఘటనలు జరుగుతున్నాయి. బస్టాండ్ ఎదురుగా, ఇన్ గేట్, ఔట్ గేట్ల పక్కన టేలాలు, దుకాణాలు ఉండడం వలన లోపలి నుంచి వస్తున్న బస్సు డ్రైవర్లకు రాజీవ్ రహదారిపై నుంచి వచ్చే వాహనాలు కనబడడం లేదు. దాంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. బస్టాండ్ ఎదురుగా ఉన్న టేలాలు దుకాణాలు తొలగించాలని పలువురు పేర్కొంటున్నారు. అలాగే శిథిలావస్థకు చేరిన బస్టాండ్ స్థానంలో కొత్తగా బస్‌స్టేషన్‌ను పెరిగిన అవసరాలకు అనుగుణంగా నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వ్యవసాయ మార్కెట్‌లో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

- తొలగించాలంటున్న రైతులు



ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 21: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఉన్న ట్రాన్స్‌ఫార్మన్ ప్రమాదకరంగా మారింది. తొలగించాలని రైతులు ఎన్నిసార్లు సంబంధిత అధికారులకు మొర పెట్టు కున్నా స్పందించడం లేదని వారు తెలిపారు. వ్యవసాయ మార్కెట్‌లో గత 20 సంవత్సరాల క్రితం సంబంధిత విద్యుత్ అధికారులు కరెంటు ట్రాన్స్‌ఫార్మర్ వేశారు. 11కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా మండలంలోని చిన్నరాతుపల్లి, పెద్దరాతుపల్లి, ఇదిలాపూర్ తదితర గ్రామాలకు విద్యుత్ అందిస్తున్నారు. అదే విధంగా ఈ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా తారుపల్లి, మొట్లపల్లి శివారులోని రైతులు వ్యవసాయ కరెంటు మోటార్లకు విద్యుత్ అందిస్తున్నారు. గత 15 సంవత్స రాలుగా వ్యవసాయ మార్కెట్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం నడుస్తోంది. ఈ కొనుగోలు కేంద్రానికి వరిధాన్యం తెచ్చే రైతులు ట్రాన్స్‌ఫార్మర్ కిందికి ఉన్న కారణంగా భయాందోళనకు గురవుతున్నారు. గతంలో లారీల్లో వరిధాన్యం సంచులు నింపేటప్పుడు తాము షాక్‌కు గురైనట్టు హమాలీలుగా పేర్కొంటున్నారు. వ్యవసాయ మార్కెట్‌లో ప్రహరి గోడ లేనప్పుడు మార్కెట్‌లో గడ్డి మేసేందుకు వచ్చే గేదెలు ట్రాన్స్‌ఫార్మర్ షాక్ తగిలి మృతిచెందిన సంఘటలున్నాయి. ప్రస్తుతం వ్యవసాయ మార్కెట్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రం నడుస్తోంది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ కిందకి ఉన్న కారణంగా రైతులు భయభయంగా వరిధాన్యం వ్యవసాయ మార్కెట్‌లో ఆరబోస్తున్నారు. గతంలో ఎన్నోసార్లు వ్యవసాయ మార్కెట్‌లో ఉన్న ఈ ట్రాన్స్‌ఫార్మర్ తొలగించాలని సంబంధిత అధికారులకు విన్నవించడం జరిగిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని రైతులు కోరుతున్నారు. కాగా, ఈ విషయమై సంబంధిత విద్యుత్ అధికారులు మాట్లాడుతూ ఈ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు వ్యవసాయ మార్కెట్‌లో ఉన్న 10 కరెంటు పోల్స్ తొలగించేందుకు సంబంధిత వ్యవసాయ శాఖకు ప్రతిపాదనలు ఇచ్చామని పేర్కొన్నారు. అయితే సంబంధిత వ్యవసాయ శాఖ అధికారుల నుంచి తమకు ఎలాంటి సమాచారం రాలేదని పేర్కొన్నారు.

నియామకం



పీ రమ్యయాదవ్

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 21: నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టిస్ మూమెంట్ జిల్లా అధ్యక్షురాలిగా పీ రమ్యయాదవ్‌ను నియమిస్తూ సంఘం జాతీయ అధ్యక్షుడు షబ్బీర్‌అలీ ఉత్తర్వులు జారీచేశారు. తన నియామకం కోసం కృషి చేసిన జాతీయ అధ్యక్షుడు షబ్బీర్ అలీకి కృతజ్ఞతలు తెలిపారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

● ప్రైవేటు ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన

సుభాష్‌నగర్, ఏప్రిల్ 21: కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఐదు సంవత్సరాల బాలుడు మృతి చెందాడు. మృతుడి బంధువులు తెలిపి న వివరాల ప్రకారం రామడుగు మండల కేంద్రానికి చెందిన దంపతులు తమ కుమారుడు కీర్తి చైత్రిక్(5)కు గుండెకు సంబంధించిన సమస్యతో ఈ నెల 19న నగరం లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అతడికి ఈనెల 20న ఆపరేషన్ చేయగా అదే రోజు రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. ఆపరేషన్ వికటించడం వల్లే తమ బాబు మరణించాడని ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

● ఆసుపత్రిని సీజ్ చేయాలి

బాలుడి మృతికి కారణమైన ఆసుపత్రిని సీజ్ చేయా లని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోనగిరి మహేందర్, బ్రాహ్మణపల్లి యుగేందర్ డిమాండ్ చేశా రు. ధనార్జనే ధ్యేయంగా రోగుల జీవితాలతో ఆడుకుంటు న్నారని ఆరోపించారు. కీర్తి చైత్రిక్‌కు గుండెకు రంధ్రం ఉందని ఆపరేషన్ చేయాలని, రూ.1,70,000ల ప్యాకేజీ అని చెప్పి ఆపరేషన్ చేశారని ఆరోపించారు. అయినప్ప టికీ మరణించాడని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేప డతామని వారు హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

మానకొండూర్, ఏప్రిల్ 21: మండలంలోని గట్టుదుద్దెనపల్లిలో ఆదివారం మోటారుసైకిల్‌ను కారు ఢీ కొన్న ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాపూర్ మండలంలోని పోలంపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి గట్టుదుద్దెనపల్లి వచ్చాడు. పనులు ముగించుకొని స్వగ్రామానికి తిరిగి వెళుతుండగా కరీంనగర్ నుంచి వరంగల్ వెళుతున్న కారు ఢీకొట్టింది. కిందపడిన శ్రీనివాస్‌కు తీవ్రగాయాలయ్యాయి. 108 సిబ్బంది కరీంనగర్‌కు తరలించారు.

బావిలో పడి వృద్ధుడి మృతి



పోశయ్య మృతదేహం

వీణవంక, ఏప్రిల్ 21: మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన బొంగోని పోశయ్య (73) అనే వృద్ధుడు బావిలో పడి మృతి చెందాడు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోశయ్య శనివారం ఉదయం బహిర్భూమికి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతుం డగా ఇంటికి దగ్గరలో గల పొలం సమీపంలో ఉన్న బావి గట్టు పైన చెప్పులు, చేతికర్ర కనిపించాయి. అనుమానంతో బావిలో వెతుకగా పోశయ్య మృతదేహం లభించింది. ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై తిరుపతి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వడదెబ్బతో ఒకరు..

శంకరపట్నం, ఏప్రిల్ 21: వడదెబ్బతో అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శంకరపట్నం మండలం తాడికల్ గ్రామానికి చెందిన బుద్దార్తి నర్సయ్య (70) అనే వృద్ధుడు ఆదివారం మృతి చెందాడు. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో శుక్రవారం వడదెబ్బకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే కరీంనగర్‌కు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం నర్సయ్య మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

చందుర్తి, ఏప్రిల్ 21 : చందుర్తి మండలం మూడపల్లి గ్రామ శివారులోని మూలమలుపు వద్ద బైక్ అదుపు తప్పి కట్ట లింగంపేట గ్రామం చెందిన యువకుడుకి గాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం..మండలంలోని కట్ట లింగంపేట గ్రామానికి చెందిన గుడిపల్లి గంగాధర్ అనే యువకుడు బైక్‌పై వేములవాడ నుంచి కట్టలింగంపేట గ్రామానికి వెళుతుండగా మూడపెల్లి వద్ద అదుపుతప్పి కిందపడ్డాడు. గాయపడిన గంగాధర్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం వేములవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో యువకుడికి..

గంభీరావుపేట, ఏప్రిల్ 21: మండలంలోని ముస్తాఫనగర్‌లో ఓ యువకుడుకి విద్యుదాఘాతంతో తీవ్రగాయాలయ్యాయి. గ్రామానికి చెందిన కె స్వామి ఆదివారం ఆకస్మాత్తుగా విద్యుదాఘాతంతో గురవ్వడంతో సిరిసిల్లా ఏరియా ఆసుపత్రికి తరలించారు. తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

తంగళ్లపల్లి, ఏప్రిల్ 21: తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడు సుద్దాల దేవయ్యగౌడ్ ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వృత్తిలో భాగంగా ఆదివారం తాటి చెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కింద కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. తోటి కార్మికులు గమనించి 108 వాహనానికి సమాచారం అందించారు. దేవయ్యను జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

పిచ్చికుక్క దాడిలో నలుగురికి గాయాలు

ఎలిగేడు, ఏప్రిల్ 21: పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం నర్సాపూర్ గ్రామంలో ఆదివారం పిచ్చికుక్క వీరంగం సృష్టించింది. ఉదయం ఇంటి పక్కనున్న రోడ్డుపై ఆడుకుంటున్న మెరుగు రమేష్, స్వప్న దంపతుల కుమారుడు శ్రీరామ్(3)తోపాటు మరో ముగ్గురిపై పిచ్చి కుక్క దాడి చేసింది. శ్రీరామ్ తల, ఇతర చోట్ల తీవ్రంగా గాయపరిచింది. శ్రీరామ్‌ను చికిత్స నిమిత్తం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తర్వాత వైద్యులు సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.

కారు బోల్తా.. ఇద్దరికి గాయాలు

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 21: మండలంలోని అందుగులపల్లి గ్రామ శివారులో ప్రమాదవశాత్తు కారు బోల్తా పడి ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దకల్వల గ్రామానికి చెందిన నలుగురు బసంత్‌నగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శుభకార్యానికి వెళ్లి తిరిగి పెద్దపల్లికి వస్తున్న క్రమంలో అందుగులపల్లి గ్రామ శివారులో ప్రమాదవశాత్తు కారు బోల్తాపడింది. కారులో నలుగురు ప్రయాణిస్తుండగా ఇద్దరికి గాయాలు కావడంతో పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ముస్తాబాద్, ఏప్రిల్ 21: మండలంలోని నామాపూర్ గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యంను ఆదివారం ఏఎస్సై వెంకటరమణ పట్టుకున్నారు. ఏఎస్సై వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం నామాపూర్ గ్రామానికి చెందిన వానరాసి దుర్గయ్య అనే వ్యక్తి దాదాపు ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఇంట్లో నిలువ ఉంచగా ఏఎస్సైకి అందిన సమాచారం మేరకు వాటిని పట్టుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

కారు బైక్ ఢీ : ఒకరి మృతి

కొడిమ్యాల, ఏప్రిల్ 21 : కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై ఉన్న మండలంలోని దొంగలమర్రి పోలీస్ చెక్‌పోస్ట్ సమీపంలో ఆదివారం కారు బైక్ ఢీకొన్న సంఘటనలో బైక్‌పై ఉన్న ఆదిత్య(16)మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. జగిత్యాల వైపు నుంచి కారు కరీంనగర్ వైపు వెళ్తుండగా దొంగలమర్రి పోలీస్ చెక్‌పోస్ట్ సమీపంలో చల్‌గల్ గ్రామానికి చెందిన ఎం.ఏ సమద్, ఎన్.ఆదిత్య బైక్‌పై కరీంనగర్ నుంచి జగిత్యాల వైపు వస్తుండగా కారు, బైక్ ఢీకొన్నాయి. ఈ సంఘటనలో బైక్‌పై ఉన్న చల్‌గల్ గ్రామానికి చెందిన ఎం.ఏ సమద్, ఎన్. ఆదిత్యకు గాయాలయ్యాయి. క్షత గాత్రులను కొడిమ్యాల బ్లూ కోట్ పోలీసులు చికిత్స నిమిత్తం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. బైక్ నడుపుతున్న ఎన్.ఆదిత్య ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

డిపాజిట్ల పేరుతో మోసం

● చేతులెత్తేసిన సంస్థ ● బాధితుల ఆందోళన

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 21: జిల్లాలో ఓ సంస్థ రికరింగ్ డిపాజిట్లు సేకరించి గడవుతీరాక చెల్లింపులు చేయక చేతులెత్తేయడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఓ సంస్థ ప్రధాన కార్యాలయంను నెలకొల్పి సిరిసిల్ల, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట తదితర ప్రాంతాలలో రికరింగ్ డిపాజిట్‌లు, డిపాజిట్‌లు సేకరించింది. రికరింగ్ డిపాజిట్‌లు, డిపాజిట్‌ల సేకరణకు కమీషన్‌ల ఆశ చూపడంతో పలువురు నిరుద్యోగ యువకులు ఏజెంట్లుగా చేరి అనేకమంది వద్ద పొదుపు పేరిట డిపాజిట్‌లు సేకరించారు. ఒక్కొక్కరి వద్ద ప్రతి నెల రూ.1000 నుంచి రూ. 10 వేలు వసూలుచేసి 60 నెలలకు సేకరించారు. ఈ విధంగా వందలాది మంది డిపాజిట్‌లు, రికరింగ్ డిపాజిట్‌ల పేరిట డబ్బులు కట్టి గడువు తీరిన తర్వాత ఆ డబ్బు రెట్టింపు మొత్తంను ఆ సంస్థ చెల్లించడం లేదు. రికరింగ్ డిపాజిట్‌ల సేకరణకు ఏర్పాటు చేసిన ప్రధాన కార్యాలయం తెరువడం లేదు. దీంతో అనేక మంది బాధితులు కార్యాలయానికి వచ్చి ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఆ సంస్థపై జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్‌లలో బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు ఆ సంస్థపై మూడు కేసులు నమోదయ్యాయి. ఈ విషయమై సిరిసిల్ల టౌన్ సిఐ రఘుపతిని సంప్రదిస్తే ఇప్పటివరకు ఆ సంస్థపై ఒక కేసు నమోదు చేశామని, సిరిసిల్ల పట్టణంలోని పత్తిపాక వీధిలో ఏర్పాటు చేసిన ఆ సంస్థలో ఎవరైనా పెట్టుబడి పెట్టి నష్టపోయి ఉంటే వెంటనే ఫిర్యాదు చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కాంగ్రెస్ నేత మృతి


శేఖర్ (ఫైల్)

గొల్లపల్లి, ఏప్రిల్ 21 : పెగడపల్లి మండలం నందగిరి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ గొల్లపల్లి మండల యూత్ ప్రధాన కార్యదర్శి, మండలంలోని ఇబ్రాజ్ పల్లె గ్రామానికి చెందిన సంకటి చంద్రశేఖర్ యాదవ్ (31) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. చంద్రశేఖర్ కరీంనగర్ జిల్లా గంగాధర మండలానికి వెళ్లి ఇంటికి వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. చంద్రశేఖర్‌కు తల్లిదండ్రులు, భార్య శిరీష, ముగ్గురు చిన్నారులు ఉన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బాధిత కుటుంబానికి రూ.20వేలు అందించాడు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కటారి చంద్రశేఖర్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ముస్కు నిశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా మల్లన్న బోనాలు


ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 21 : మండలంలోని మాసాయిపేట గ్రామంలో మల్లన్న స్వామి బోనాల జాతర వైభవంగా యాదవుల ఆధ్వర్యంలో జరిపారు. ఆదివారం ఉదయం ఆలయంలోని ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలు పురోహితుడు నిర్వహించారు. సాయంత్రం బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఆలయాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొసగంటి మహేష్, మొండి వెంకటేష్‌యాదవ్, జాయ మహేష్‌యాదవ్, శరత్, అరుణ్, శ్రీకాంత్ సెందిల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నేటి నుంచే హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు

● మూడు రోజుల పాటు వేడుకలు
● తరలిరానున్న లక్షలాది భక్తులు

మల్యాల ఏప్రిల్ 21: కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో సోమవారం నుంచి హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రతియేటా నిర్వహించే హనుమాన్ చిన్న జయంతిని సోమవారం నుంచి బుధవారం వరకు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ మూడు రోజులపాటు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాదిగా అంజన్న దీక్షాపరులు, భక్తులు కాలి నడకన, వాహనాల ద్వారా అంజన్న సన్నిధికి చేరుకోనున్నారు. ఇక్కడ మాల విరమణ చేయడం అత్యంత పవిత్రంగా భావిస్తారు. కొండగట్టులో జరిగే ఉత్సవాల కోసం అంజన్న ఆలయ పరిసరాలలో క్యూలైన్, బారికేడ్లు తదితర ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాలకు సుమారు 650మందితో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. దిగువ కొండగట్టు, ఘాట్‌రోడ్డు, కొండపైన, ఆలయం, దీక్షవిరమణ మండపం, ప్రసాదాల కౌంటర్, కోనేరు, పార్కింగ్ స్థలాలు, జేఎన్ టీయూ, దొంగల మర్రి ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తారు.


కొండగట్టులో స్వాగత తోరణం


కొనసాగుతున్న పనులు


మాల విరమణ చేస్తున్న దీక్షాపరులు

● ఏర్పాట్లు ఇలా..

- కొండపైన, ఘాట్‌రోడ్డుపైన 28 చోట్ల చలివేంద్రాలతో పాటు మొబైల్ వాహనాల ద్వారా భక్తులకు నీటిని అందించనున్నారు.
- ఘాట్‌రోడ్డు వాహనాలకు అనుమతి లేకపోగా.. కొండపైన బొజ్జ పోతన్న, కొండగట్టు స్టేజీల వద్ద పోలీసుల ఔట్ పోస్టు
- దీక్షవిరమణలకు ప్రస్తుతం ఉన్న అర్చకులకు తోడు మరో వంద మంది సిబ్బంది.
- కొండగట్టు స్టేజీ సమీపంలోని తుమ్మ చెరువు, కొండపైన బొజ్జ పోతన్న ఆలయం, దొంగలమర్రి-జేఎన్‌టీయూ మార్గంలో బృందావనం రిసార్ట్, జేఎన్‌టీ యూ సమీపంలో కొండపైకి వెళ్లే మార్గంలో, దాని పక్కనే మరొకటి వాహనాల కోసం పార్కింగ్
- బస్టాండ్ వద్ద 14 ప్రసాద, టికెట్ కౌంటర్లు
- 5 కేంద్రాలలో మూడు షిఫ్ట్‌లలో కొండపైన, స్టేజీ వద్ద వైద్య సిబ్బంది విధులు
- మెట్ల మార్గంలో విద్యుత్ దీపాల ఏర్పాటు. 24గంటల విద్యుత్ సౌకర్యం. 9 జనరేటర్‌ల ఏర్పాటు
- అందుబాటులో ఫైర్ ఇంజన్.. అంబులెన్స్, భక్తులకు సరిపడా ఆర్టీసీ బస్సుల సేవలు
- తాత్కాలిక మరుగుదొడ్లు, మొబైల్ మరుగుదొడ్లు

అన్ని ఏర్పాట్లు చేశాం
చంద్రశేఖర్, ఈవో

జయంతి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. తాగునీటి కోసం చలివేంద్రాలు, మొబైల్ చలివేంద్రాలు, పార్కింగ్ ఏర్పాట్లు చేపట్టాం.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

● తప్పిన ప్రమాదం

ముత్తారం, ఏప్రిల్ 21: మంథని-ఓడేడు ప్రధాన రహదారి ముత్తారంలో ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. ముత్తారం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం సమీపాన ప్రధాన రహదారి పైనే ఇసుక డీడీల కోసం లారీలు రోడ్డుపై నిలిపివేయడంతో ఓడేడు నుంచి గోదావరిఖని వెళుతున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి లారీని ఢీకొట్టాడు. ఆ సమయంలో ఆర్టీసీ బస్సులో ఎక్కు మంది ప్రయాణికులు లేకపోవడంతో పాటు రోడ్డుపై ప్రయాణికులు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

మరిమడ్లలో హైమాస్ట్ లైట్‌ల చోరీ

కోనరావుపేట, ఏప్రిల్ 21 : కోనరావుపేట మండలం మరిమడ్లలో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు హైమాస్ట్ లైట్లను అపహరించారు. మరిమడ్ల గ్రామంలోని పల్లెప్రకృతి వద్ద నూతనంగా ఏర్పాటు చేసి దానికి సంబంధించిన పనులు కొనసాగుతున్న నేపథ్యంలోనే గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులకు ఫిర్యాదుచేసినట్లు గ్రామ పంచాయతీ సిబ్బంది తెలిపారు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం : హుజూరాబాద్ యువకుడి మృతి


ముక్క నివేష్ (ఫైల్)


డాక్టర్ నవీన్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ప్రణవ్

హుజూరాబాద్, ఏప్రిల్ 21: కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు చెందిన ఓ విద్యార్థి శనివారం అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. హుజూరాబాద్ పట్టణానికి చెందిన డాక్టర్ ముక్క నవీన్-స్వాతి దంపతుల కుమారుడు ముక్క నివేష్ (19) బీటెక్ చదవడం కోసం ఏడాదిన్నర క్రితం అమెరికాలోని అరిజోనా రాష్ట్రానికి వెళ్లాడు. ప్రస్తుతం నివేష్ బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. నివేష్ శనివారం (అమెరికా కాలమాన ప్రకారం) తన స్నేహితులతో కలిసి కారులో జలపాతం చూసేందుకు వెళ్లాడు. తిరిగి అరిజోనాలోని తన ఇంటికి వెళ్తున్న క్రమంలో వెనుక నుంచి వచ్చిన కారు బలంగా వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని ఢీకొట్టింది. కారులో వెనుక కూర్చున్న నివేష్‌తో పాటు హనుమకొండ జిల్లా స్టేషన్ ఘణపూర్‌కు చెందిన గౌతమ్ అనే విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందారు. అరిజోనా పోలీసులు నివేష్ తండ్రి డాక్టర్ నవీన్‌కు సమాచారం అందించారు. చదువు కోసం వెళ్లిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో నవీన్ కుటుంబంలో విషాదం నెలకొంది. కాగా నివేష్ తాత కృష్ణమూర్తి సైతం వైద్యుడిగా సేవలు అందించారు. నివేష్ మృతదేహం అమెరికా నుంచి హుజూరాబాద్‌కు రావడానికి మూడు రోజులు పట్టే అవకాశం ఉందని సమాచారం.

● పలువురి పరామర్శ

ప్రముఖ వైద్యుడు నవీన్ కుమారుడు అమెరికాలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న పలువురు ప్రముఖులు మృతుడి కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించారు. హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్‌తో పాటు పలువురు ప్రముఖులు నవీన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, ఎంపీ బండి సంజయ్‌కుమార్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ మంత్రులు ఈటల రాజేందర్, ఇనుగాల పెద్దిరెడ్డి నవీన్‌తో ఫోన్‌లో మాట్లాడారు.

గంజాయి విక్రయిస్తే పీడీ యాక్ట్ నమోదు



మాట్లాడుతున్న సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడ రూరల్, ఏప్రిల్ 21: గంజాయి రవాణా, విక్రయాలు జరిపితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. వేములవాడ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిషేధిత గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్దనుంచి 5కిలోల గంజాయి స్వాధీనపరచుకుని సీజ్ చేసామన్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన వికాస్, ఒడిశా నుంచి అదే రాష్ట్రానికి చెందిన ఇద్దరు మైనర్ల ద్వారా 5కిలోల గంజాయిని తెప్పించి ముగ్గురు జగదల్పూర్‌లో కలుసుకుని సిరిసిల్ల, వేములవాడ పట్టణాలలో గంజాయి అలవాటు పడిన వ్యక్తులకు అమ్మి సులవుగా డబ్బు సంపాదించాలనుకున్నారు. ఇదే క్రమంలో జగదల్పూర్ నుంచి బస్సులో కరీంనగర్‌కు అక్కడి నుండి వేములవాడ మండలం చింతల్‌ఠాణా శివారుకి వస్తున్నారన్న సమాచారంతో శనివారం సాయంత్రం చింతల్‌ఠాణా బస్‌స్టాప్ వద్ద వేములవాడ పట్టణ పోలీసలు అదుపులోనికి తీసుకుని వారి వద్ద నుంచి 5కిలోల గంజాయిని స్వాధీన పరచుకున్నారు. గంజాయి మహమ్మారిని తరమికొట్టడంలో బాగంగా కఠినంగా వ్యవహరిస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. వేములవాడ ప్రాంతంలో నిషేధిత గంజాయిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రజలు సహకరించాలన్నారు. మన చుట్టుప్రక్కల గంజాయి విక్రయించినట్లు తెలిసినా, గంజాయిని సేవిస్తున్నట్లు తెలిసినా పోలీసులకు సమాచారం అందించాలని లేదా 100కు డయల్ చేయాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ సంవత్సరంలో జిల్లాలో గంజాయికి సంబంధించి 14 కేసులు నమోదు చేసి 39 మందిని అరెస్టు చేసామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. గంజాయి నిందితులను అరెస్టు చేయడంలో చురుకుగా వ్యవహరించిన ఐడీ పార్టీ కానిస్టేబుళ్ల సమీ, గోపాల్, శ్రీనివాస్‌లను ఎస్పీ అఖిల్ మహాజన్ రివార్డులను అందజేసి అభినందించారు. ఈ సమావేశంలో వేములవాడ ఇంచార్జి డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, రూరల్ , పట్టణ ఇంచార్జి సీఐ శ్రీనివాస్, టౌన్ ఎస్సై అంజయ్య, పోలీసు సిబ్బంది ఎటటటటటటటటటటటాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామచంద్ర స్వామి రథోత్సవం

● భారీగా తరలి వచ్చిన భక్తులు


స్వామివారి రథోత్సవం

బీర్‌పూర్,ఏప్రిల్ 21:బీర్‌పూర్ మండలంలోని కొల్వాయి గ్రామంలో ఆదివారం శ్రీ రామచంద్ర స్వామి రథోత్సవం వైభంవగా జరిగింది. సీతారాముల ఉత్సవ విగ్రహాలను అందంగా రంగు రంగుల పూలతో అలంకరించిన రథం వద్దకు సన్నాయి మేళాలతో వేధపండితుల మత్రోత్సరణల మధ్య తీసుకవచ్చి రథంపై ఆశీనుల గావించి రథోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రథోత్సవం నిర్వహిస్తున్న సమయంలో హనుమాన్ దీక్షాపరులు రామ భజనలు చేస్తూ నృత్యాలు చేశారు. జాతర బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు ఆయా ప్రాంతాలనుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాలలో భక్తుల దాహార్తిని తీర్చడం కోసం గ్రామంలోని అక్షర హైస్కూల్ కరస్పాండెంట్ పైడి మారుతి ఆధ్వర్యంలో మజ్జిగా ప్యాకెట్లు, చల్లని నీరు అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటీసీ పాత పద్మ రమేస్, ఎంపీటీసీ రంగు లక్ష్మన్, ఆలయ చైర్మన్ సతీస్, నాయకులు గుండేటి సురేష్, గాజర్ల రామచంద్రం గౌడ్, రామకిష్టు గంగాధర్, రంగు మల్లేశం, జక్కుల చెంద్రయ్య, రవిందర్ రావ్ భక్తులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణ కేసులో ఇద్దరి అరెస్టు


నిందితులను అరెస్టు చేసి జైలుకు తరలిస్తున్న సీఐ ప్రదీప్‌కుమార్

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 21: నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి, ఇదివరకే విక్రయించిన భూమిని ఆక్రమించిన కేసులో నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి ఇద్దరు నిందితులను అరెస్టు చేశామని కరీంనగర్ రూరల్ సీఐ ఎ.ప్రదీప్‌కుమార్ తెలిపారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. గన్నేరువరం మండల కేంద్రానికి చెందిన తెల్ల రాజయ్య అనే వ్యక్తి 2003లో తీగలగుట్టపల్లిలో సర్వేనెంబరు 233/ఇ లోని వెంచర్‌లో 293.33 గజాల విస్తీర్ణం కలిగిన 16వ ప్లాట్‌ను మూలగౌరారెడ్డి వద్ద కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. మూల గౌరారెడ్డి మరణానంతరం అతని కొడుకు మూల తిరుమలరెడ్డి ఆ ప్లాట్ మాదేనంటూ ఆక్రమించుకుని, రెండు ప్లాట్లుగా విభజించి ఆ ప్లాట్ మూల వీరమ్మ పేరిట తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించాడు. అనంతరం ఆ రెండు ప్లాట్లను మూల సూర్యప్రకాష్‌రెడ్డి, లంక శేఖర్‌లకు విక్రయించినట్లు తప్పుడు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు సృష్టించడంతో పాటు ఆ స్థలంలో గోడను కూడా నిర్మించారు. దీంతో బాధితుడు తెల్ల రాజయ్య కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ అనంతరం నిందితులు భూమిని విక్రయించి, మళ్లీ ఆ భూమిని ఆక్రమించినట్లు వెల్లడైంది. ఈ మేరకు నిందితులపై ఐపీసీ సెక్షన్ 420, 467, 468, 471, 120 బి, రెడ్‌విత్ 34 కింద కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. నిందితు లు మూల తిరుమల్‌రెడ్డి, లంక శేఖర్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి ఆదేశాలతో 14 రోజుల రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

పల్లెల్లో ప్రబలుతున్న పచ్చకామెర్లు


తుర్కలమద్దికుంటలో రక్త నమూనాల సేకరణ

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 21: మండలంలోని పలు గ్రామాల్లో 120 మందికి పైగా పచ్చకామెర్ల వ్యాధితో బాధపడుతున్నారు. మండలంలోని తుర్కలమద్దికుంట, అప్పన్నపేట, హన్మంతునిపేట, భోజన్నపేట గ్రామాల్లో కలుషిత నీటి వల్ల పచ్చకామెర్ల వ్యాధి వస్తున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రాఘవపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో హన్మంతునిపేట, భోజన్నపేట గ్రామాల్లో పచ్చకామెర్ల వ్యాధి ప్రారంభ దశలో ఉంది. ప్రభుత్వ వైద్యుల దృష్టికి వచ్చిన ప్రకారం కలుషిత నీటితో తయారు చేసిన ఐస్ క్రీం, క్లోరినేషన్ లేని తాగునీటి వల్ల వస్తున్నట్లు అంచనా వేస్తున్నారు. అత్యధిక కేసులు నమోదు అయిన గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహిస్తూ నివేదికలను వైద్యాధికారులకు పంపిస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సంబంధిత గ్రామాల్లో తాగునీటి నమూనాలను సేకరించి పరీక్షల కోసం ల్యాబ్‌లకు పంపిస్తున్నారు. తాగునీటిని క్లోరినేషన్ చేసిన తరువాతనే సరఫరా చేస్తున్నామని ఎంపీడీవో గున్నాల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

అప్పు ఇచ్చిన వారి వేధింపులతో మహిళ ఆత్మహత్య


రాజమల్లమ్మ

సుల్తానాబాద్, ఏప్రిల్ 21: అప్పుల వారి వేధింపులు భరించలేక పోగుల రాజమల్లమ్మ (57) మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని సుద్దాల గ్రామంలో జరిగింది. ఎస్ఐ శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం సుల్తానాబాద్ మండలంలోని సుద్దాల గ్రామానికి చెందిన పోగుల గట్టయ్య రాజమల్లమ్మ దంపతులు అదే గ్రామానికి చెందిన పోగుల సంపత్ వద్ద నాలుగేళ్ల క్రితం ఒక లక్ష ముప్పైవేల రూపాయలను అప్పుగా తీసుకున్నారు. ఈ అప్పు తీర్చాలంటూ సంపత్ పదే పదే రాజమల్లమ్మ ఇంటి వద్ద గొడవ చేసేవాడని తరుచూ వారు ఉండే ఇంటికి తాళాలు వేసి వేధించేవాడని చెప్పారు. ఏడాది క్రితం గట్టయ్య చనిపోగా ఆయన భార్య రాజమల్లమ్మ ఒంటరిగా ఇంటి వద్ద ఉంటుంది. ఆమెను అప్పు చెల్లించాలని వేదిస్తున్నారు. పలు సార్లు పెద్ద మనుష్యుల వద్ద పంచాయతీలు కూడా జరిగాయి. దాంతో ఏడాది క్రితం రాజమల్లమ్మ లక్ష రూపాయలను సంపత్‌కు చెల్లించింది. కాగా మిగిలన ముప్పై వేల రూపాయలతో పాటు వాటికి సంబంధించిన వడ్డీ చెల్లించాలని రాజమల్లమ్మ ఇంటి వద్దకు వచ్చి సంపత్ వేదింపులకు గురి చేసేవాడని ఈ నేపథ్యంలో శనివారం కూడా రాజమల్లమ్మను ఇలాగే వేదించగా అమె వనస్తాపం చెంది ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. చికిత్స నిమిత్తం సుల్తానాబాద్ అస్పత్రికి తర లించగా మెరగైన వైద్యం కోసం కరీంనగర్ తీసుకువెళ్లారు. అక్కడ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆది వారం మధ్యాహ్నం మృతి చెందినట్లు ఎస్ఐ వివరించారు. మృతురాలి కొడుకు పోగుల ప్రభాకర్ ఫిర్యాదు మేరకు సంపత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రావణ్ తెలిపారు.

వైభవంగా సీతారాముల ప్రాణ ప్రతిష్ఠాపనోత్సవాలు


మల్కాపేట రామాలయంలో ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో చిన్నజీయర్ స్వామి

కోనరావుపేట, ఏప్రిల్ 21: కోనరావుపేట మండలం మల్కాపేట రిజర్వాయర్ ప్రాంతంలోని గుట్టపైన నిర్మించిన సీతారాముల ఆలయంలో ఆదివారం శ్రీ చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా ధ్వజస్తంభ, విగ్రహాల ప్రాణప్రతిష్ఠ అంగరంగ వైభవంగా జరిగింది. కోనరావుపేట మండలం మల్కాపేట రిజర్వాయర్ ప్రాంతంలోని గుట్టపైన మాజీ మంత్రి ఆనందరావు కుటుంబ సభ్యులు చెలిమెడ వెంకటేశ్వరరావు, లక్ష్మీనరసింహారావు, మధుసూదన్‌రావు కుటుంబ సభ్యుల సహకారంతో రామాలయ నిర్మాణాన్ని నిర్మించారు. ఈ నెల 18 నుంచి ఆదివారం వరకు ధ్వజస్తంభన ఉత్సవాలు ప్రాణప్రతిష్ఠ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ధ్వజస్తంభ ఏర్పాటుకు శనివారం రాత్రి చిన్న జీయర్‌స్వామి మల్కాపేటకు చేరుకొని ఆదివారం ఉదయం నుంచి ఆయన చేతుల మీదుగా విగ్రహ ప్రాణప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులను, భక్తులను దీవించారు. పక్కనే ఉన్న మల్కాపేట రిజర్వాయర్ ప్రాంతాన్ని పరిశీలించారు, అతి తొందరలోనే ఈ ప్రాంతం ఆధ్యాత్మికతతో విరాజిల్లుతుందని ఈ ప్రాంతానికి సీత, రామ, లక్ష్మణులు వచ్చారని ఈ ప్రాంతం ధన్యమైపోతుందని భక్తులకు ఉపదేశాన్ని ఇచ్చారు. ఈ వేడుకల్లో కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, లోకయుక్త చైర్మన్ సి.వి.రాములు, కోరుట్ల మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, జడ్పీ చైర్ పర్సన్ అరుణ రాఘవరెడ్డి, నాస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, లోక బాపురెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, కోనరావుపేట ఎంపీపీ చంద్రయ్య గౌడ్, ప్యాక్స్ చైర్మన్లు రామ్మోహన్‌రావు, బండ నర్సయ్య, గ్రామ మాజీ సర్పంచ్‌ఆరె లత, మహేందర్, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, బీఆర్ఎస్ నాయకులు మల్యాల దేవయ్య, రాఘవరెడ్డితో పాటు పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

రామగుండంలో అనుమతులు లేకుండానే భారీ కట్టడాలు

- నిర్మాణాలు పూర్తవుతున్నా పొందని ఎన్‌టీపీసీ యాజమాన్యం - అక్రమ కట్టడాలు కూల్చుతామంటూ మున్సిపల్ కార్పొరేషన్ నోటీసులు

కోల్‌సిటీ, ఏప్రిల్ 21: మున్సిపాలిటీలలో ఒక పేదవాడు షెడ్డు వేసుకున్నా, గోడ కట్టినా టౌన్‌ప్లానింగ్ విభాగం సిబ్బంది వాలిపోతారు. అనుమతులు తీసుకుని చిన్న చిన్న భవనాలు నిర్మించినా కార్పొరేటర్లు, నాయకులు లోపాలున్నాయంటూ చుక్కలు చూపిస్తారు. కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగంలో జేసీబీలు, గడ్డపారలతో దిగి నానా హంగామా చేస్తుంది. కానీ ఒక కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ నవరత్నాల్లో ఒకటిగా ఇతర సంస్థలకు ఆదర్శంగా ఉండాల్సిన ఎన్‌టీపీసీనే మున్సిపల్ చట్టాన్ని ఉల్లంఘిస్తోంది. మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే ఎన్‌టీపీసీ పర్మినెంట్ టౌన్‌షిప్‌లో టవర్లు, వివిధ రకాల నివాస కాలనీలో నిర్మించింది. కార్పొరేషన్ నిర్మాణ ఆరంభంలోనే నోటీసులు ఇచ్చినా అనుమతులు తీసుకోకుండానే నిర్మాణాలు పూర్తి చేసింది. ఎన్‌టీపీసీ వైఖరిపై గరమైన రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అనుమతి లేని నిర్మాణాలను కూల్చివేస్తామంటూ నోటీసులు ఇచ్చింది. రామగుండం నగరపాలక సంస్థకు, ఎన్‌టీపీసీ యాజమాన్యానికి మధ్య నిర్మాణాల విషయమై కొత్తగా వివాదం మొదలైంది.

మున్సిపల్ చట్టం 2019 ప్రకారం మున్సిపాలిటీలకు విశేష అధికారాలు ఉన్నాయి. ముఖ్యంగా నిర్మాణ విషయంలో కఠినమైన నిబంధనలు ఉన్నాయి. వ్యక్తి అయినా, సంస్థ అయినా చట్టాన్ని అనుసరించి మున్సిపాలిటీలు, కార్పొరేషన్ నుంచి అనుమతులు తీసుకోవాలి. అనుమతి తీసుకోని నిర్మాణాలను నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేసే అధికారం మున్సిపాలిటీలకు ఉంది. రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో ఎన్‌టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్, బీఎస్ఎన్ఎల్ వంటి కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు, టీఎస్ జెన్‌కో, సింగరేణి, ఆర్‌టీసీ వంటి రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఎన్‌టీపీసీ నిర్మాణ అవసరాలకు పెద్దఎత్తున వ్యవసాయ భూములను ప్రజలు ధారదత్తం చేశారు. గ్రామాలు కనుమరుగయ్యాయి. ఎన్‌టీపీసీ సంస్థ నిర్మాణ అనుమతుల విషయంలో మొదటి నుంచి రామగుండం మున్సిపాలిటీతో ప్రతి సందర్భంలోనూ వివాదాలు నడుస్తూనే ఉన్నాయి. 7వ యూనిట్ అనుమతి వివాదం ఏళ్ల తరబడి కొనసాగి చివరికి ఫీజులు కట్టి అనుమతి తీసుకుంది. ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజమాన్యం స్పష్టతతో వ్యవహరించింది. నిబంధనల ప్రకారం మున్సిపల్ కార్పొరేషన్‌కు ఫీజులు చెల్లించి అనుమతులు తీసుకుంది. కానీ ఎన్‌టీపీసీ మాత్రం నిర్మాణ అనుమతుల విషయంలో మున్సిపల్ కార్పొరేషన్‌తో వివాదం కొనసాగిస్తోంది.



ఎన్‌టీపీసీ పీటీఎస్‌లో జరుపుతున్న నిర్మాణాలు



ఎన్‌టీపీసీ పీటీఎస్‌లో పూర్తయిన నిర్మాణాలు

అనుమతులు లేవు...

ఎన్‌టీపీసీ సంస్థ తెలంగాణ సూపర్ థర్మల్ క్రిటికల్ పవర్ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా పలు అభివృద్ధి పనులు చేపట్టింది. ఇందులో భాగంగా టౌన్‌షిప్‌లో బీ టైపు నివాసాలు, బ్యాచ్‌లర్ హాస్టల్, హెచ్‌ఓడీ బిల్డింగ్స్ గెస్టహౌస్ తదితర నిర్మాణాలు చేపట్టింది. ఈ నిర్మాణ సమయంలోనే అనుమతులు తీసుకుని పనులు జరుపాలని మున్సిపల్ కార్పొరేషన్ అనుమతులు ఇచ్చింది. దీనికి సంబంధించి అనుమతులు ఇవ్వాలంటూ దరఖాస్తు పెట్టిన ఎన్‌టీపీసీ అనుమతులు తీసుకునే విషయంలో మాత్రం నాన్చుడు ధోరణితో వ్యవహరిస్తూ వచ్చింది. కొన్ని నిర్మాణాలకు అనుమతుల ఫీజుల క్రితం రూ.90లక్షలు చెల్లించింది. మిగతా నిర్మాణాల విషయంలో పెండింగ్‌లో పెట్టింది. నిబంధనల ప్రకారం ఎల్‌ఆర్ఎస్, ఇతర ఫీజులు చెల్లించి నిర్మాణ విస్తీరణంలో 10శాతం మున్సిపల్ కార్పొరేషన్‌కు మార్టిగేజ్ చేయాల్సి ఉంటుంది. సుమారు రూ.2 కోట్లుపైగానే ఫీజుల రూపంలో మున్సిపల్ కార్పొరేషన్‌కు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ఎన్‌టీపీసీ యాజమాన్యం స్పందించకపోవడంతో మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యానికి నోటీసు ఇచ్చింది. మున్సిపల్ చట్టం -2019ని అనుసరించి అక్రమ నిర్మాణాలు జరుపుతున్నారు కనుక ఎందుకు కూల్చివేయరాదంటూ మొదటి నోటీసు ఇచ్చింది. అయినా స్పందించకపోవడంతో రెండవ నోటీసు ఇచ్చేందుకు సిద్ధమవుతుంది. ఎన్‌టీపీసీ ప్రాజెక్టు కాలుష్యంతో ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నా యాజమాన్యం మాత్రం నిధులు మాత్రం ఇతర ప్రాంతాల్లో వెచ్చించిందని ప్రజా ప్రతినిధులు ఆగ్రహంతో ఉన్నారు. ఎన్‌టీపీసీ వైఖరిపై ప్రభావిత ప్రాంతాల ప్రజలు కూడా అసంతృప్తితో ఉన్నారు. ఉపాధి, సౌకర్యాల విషయంలో ఎన్‌టీపీసీ యాజమాన్యం మాట తప్పిందనే ఆరోపణలున్నాయి. ఈ ప్రాంత అభివృద్ధిలో భాగస్వామ్యం కావడంలో చొరవ చూపడం లేదనే విమర్శలున్నాయి.

ఈ పరిస్థితుల్లో యాజమాన్యం నిర్మాణ అనుమతుల విషయంలో అనుసరిస్తున్న వైఖరి పట్ల ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం కూడా అసహనంతో ఉన్నారు.

ఎన్‌టీపీసీకి రెండో నోటీసు ఇస్తున్నాం..

-శ్రీనివాసరావు, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ

ఎన్‌టీపీసీ యాజమాన్యం నిర్మాణ అనుమతులు తీసుకోకపోవడంతో ఇప్పటికే ఒక నోటీసు ఇచ్చాం. నిబంధనల ప్రకారం 10శాతం భూమిని మార్టిగేజ్ చేయాల్సి ఉంది. యాజమాన్యం ఒక లేఖ ఇచ్చింది. మున్సిపల్ చట్టం ప్రకారం రెండవ నోటీసు ఇస్తున్నాం. చట్టం విషయంలో సామాన్యులైనా, యాజమాన్యామైనా ఒక్కటే.

పనుల్లో వేగం.. చేరువలో లక్ష్యం..

- ముమ్మరంగా 'ఖని' ప్రభుత్వ ఆసుపత్రి ఐదంతస్థుల భవన నిర్మాణ పనులు - త్వరలో అందుబాటులోకి మెరుగైన వైద్య సేవలు



గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో జరుగుతున్న భవన నిర్మాణ పనులు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 21: రామగుండం మెడికల్ కళాశాలకు అనుబంధంగా గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రూ.142కోట్లతో నిర్మిస్తున్న ఐదు అంతస్థుల భవన నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మార్చి 13న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఈ ఐదు అంతస్థుల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అన్ని హంగులతో రోగులకు అవసరమయ్యే సౌకర్యాలను ఈ ఐదు అంతస్థుల భవనంలో ఏర్పాటు చేస్తున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎమర్జెన్సీవార్డులు, ఐసీయూలు, ఔట్ పేషెంట్, శాంపిల్ కలెక్షన్, రేడియో డయాగ్నోస్టిక్, ట్రాయేజ్, మొదటి అంతస్థులో అడ్మినిస్ట్రేషన్, ఔట్ పేషెంట్ విభాగం, బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూసియన్, రెండవ అంతస్థులో జనరల్ మెడిసిన్, ఎంఐసీయూ, రిస్పిరటోరీ మెడి క్లినిక్, మూడవ అంతస్థులో జనరల్ సర్జరీ, ఎంఐసీయూ, 4వ అంతస్థులో ఆర్థోపెడిక్, పోస్ట్ ఆపరేటివ్ ఆర్థో, పెయిడ్ రూమ్స్ డబుల్, సింగల్, 5వ అంతస్థులో పోస్ట్ ఆపరేటివ్ ఓటీ, ప్రీఆపరేటివ్, పోస్ట్‌ఆపరేటివ్ రికవరీ, సెంటర్ల్యాబ్, ఆర్ఐసీయూ, ఎస్ఐసీయూతో పాటు రోగుల కోసం క్యాంటీన్ వంటి సదుపాయాలను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే రూ.23కోట్లతో 50పడకల ఐసీయూ కేంద్రం పనులు ఊపందుకున్నాయి. 50పడకల ఐసీయూ కేంద్రాన్ని ఏడాది లోపు అందుబాటులోకి తీసుకురావడానికి పనులను వేగవంతం చేస్తున్నారు. అంతేకాకుండా ఐదు అంతస్థుల భవనాన్ని త్వరితగతిన అందుబాటులోకి తీసుకువస్తే రోగులకు మరిన్ని వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

చివరి దశకు మెడికల్ కళాశాల పనులు

సింగరేణి సంస్థ రూ.510కోట్లతో నిర్మిస్తున్న రామగుండం మెడికల్ కళాశాల నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. విద్యార్థులకు క్లాస్ రూమ్‌లు, హాస్టల్ భవనాలు, స్టాఫ్ క్వార్టర్లు, సెంట్రల్ లైబ్రరీ, ప్రిన్సిపాల్ నివాస గృహంతో పాటు ఇతర విభాగాల పనులు చివరి దశకు చేరుకున్నాయి. కళాశాల ఎంట్రన్స్ నిర్మాణ పనులు కూడా వేగవంతంగా సాగుతున్నాయి. ఎస్‌టీపీల నిర్మాణ పనులు కూడా వేగంగా కొనసాగుతున్నాయి.

సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించడమే లక్ష్యం.

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



రామగుండం ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. రూ.142కోట్లతో ఐదంతస్థుల భవన నిర్మాణం, రూ.23కోట్లతో క్రిటికల్ ఐసీయూ ఏర్పాటు, మరో రూ.13కోట్లతో ఆసుపత్రిని అభివృద్ధి చేస్తాం. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోనే అన్ని రకాల వైద్య సేవలందించేలా చర్యలు చేపడుతున్నాం. రామగుండాన్ని మెడికల్‌హబ్‌గా తీర్చిదిద్దుతాం. ఇక్కడి నుంచి ఏ ఒక్కరిని ఇతర ప్రాంతాలకు రెఫర్ చేయకుండా చర్యలు చేపడుతున్నాం. ముఖ్యంగా కార్డియో, న్యూరో విభాగాలను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించాం. ఇక్కడి మెడికల్ కళాశాలతో రామగుండానికి పూర్వవైభవం వస్తుంది.

మరిన్ని సౌకర్యాల కోసం ప్రభుత్వానికి నివేదించాం..

- హిమబిందు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్



రామగుండం మెడికల్ కళాశాల రెండవ సంవత్సరం దిగ్విజయంగా ముగించుకుని మూడో సంవత్సరంలోకి అడుగు పెడుతుంది. ఇక్కడ కావాల్సిన సౌకర్యాల కోసం ప్రభుత్వానికి నివేదించాం. పూర్తి స్థాయిలో గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆయా డిపార్ట్‌మెంట్ల ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని సూచిస్తున్నాం. ఇక్కడ కార్డియో, న్యూరో విభాగాలను ఏర్పాటు చేయాలని, అందులో పూర్తిస్థాయిలో వైద్యుల నియామకం కోసం కృషి చేస్తున్నాం.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ఫైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 21: రామగిరి మండలం వెంకట్రావ్‌పల్లెకు చెందిన షేక్ సాహెరా హాజీపాషాకు ఆదివారం స్థానిక కాంగ్రెస్ నాయకులు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఆయనకు ఆర్థిక సాయం అందజేయాలని మంత్రి శ్రీధర్‌బాబుకు చేసిన విజ్ఞప్తి మేరకు వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం రూ. 47,000లను మంజూరు చేసినట్టు నాయకులు తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ చాట్ల సదానందం, విజేందర్‌రెడ్డి, శనిగరం తిరుపతి పాల్గొన్నారు.

ఖనిలో ఈశ్వర్ ప్రచారం

గోదావరిఖని, ఏప్రిల్ 21: బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఆదివారం సాయంత్రం గోదావరిఖనిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని 42వ డివిజన్ రాజన్నల సంఘం సభ్యులను కలిసి పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలిపించాలని అభ్యర్థించారు. 36వ డివిజన్‌లోని చంద్రశేఖర్‌నగర్, ఒరిస్సా కాలనీ వాసులను, విశ్రాంత ఉద్యోగులను, తిలక్‌నగర్ ఆటో యూనియన్ సభ్యులను ఈశ్వర్ కలిసి ఓటును అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మురళీధర్‌రావు, పెంట రాజేష్, తిరుపతి, మెతుకు దేవరాజు ఉన్నారు.

గుంతలమయమైన నందిమేడారం రోడ్డు

- ప్రయాణికుల ఇబ్బందులు

ధర్మారం, ఏప్రిల్ 21: ధర్మారం మండలం నందిమేడారం గ్రామ శివారు రోడ్డు గుంతలుగా మారింది. రోడ్డు తారు లేచిపోయి గుంతలుగా ఏర్పడడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి ఎస్సీ కాలనీ వరకు రోడ్డు చెడిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడాల్సివస్తోంది. అదేవిధంగా నందిమేడారం గ్రామంలో నుంచి గ్రామ పంచాయతీ పక్కన గల రిజర్వాయర్ కట్ట కింది నుంచి తాత్కాలికంగా వేసిన రోడ్డు గుండా ఆర్టీసీ బస్సులు నడుపుతున్నారు. ఈ రోడ్డు అధ్వానంగా మారింది. వర్షాకాలంలో ఐతే బురదమయమై వాహనాలు దిగబడాల్సి వస్తోంది. ఎస్సీ కాలనీ సమీపంలో లోలెవల్ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుని పూర్తిగా దెబ్బతిన్నది. మధ్యలో పెద్దగుంతగా ఏర్పడింది. తాత్కాలికంగా గుంతను పూడ్చిన ప్రమాదభరితంగానే ఉంది. ఈ రోడ్డును మరమ్మతులు చేసి బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

యూపీఎస్సీ ర్యాంకర్‌కు సన్మానం

భగత్‌నగర్, ఏప్రిల్ 21: యూపీఎస్సీలో ఆలిండియా 27 ర్యాంకు సాధించిన సాయికిరణ్‌ను లయన్స్ క్లబ్ గోల్డెన్ శాతవాహన సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రెటరీ మానవాడ శంకర్, ట్రెజరర్ నలువాల గిరిధర్‌రావు, థర్డ్ వైస్‌ప్రెసిడెంట్ చిలుకూరి రాములు, కో-ఆర్డినేటర్ కుభోజు రమేష్, లయన్ సభ్యులు మమతవేణు, కోమటిరెడ్డి తిరుపతిరెడ్డి, రామేశ్వరరావు, అనంతరెడ్డి, శ్రీనివాస్ హరిప్రియ, విజయలక్ష్మి, శరత్ చంద్ర, కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.



కార్మికుల కోసం పోరాడేది ఐఎన్‌టీయూసీ

- సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్



ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న జనక్ ప్రసాద్

గోదావరిఖని, ఏప్రిల్ 21: సింగరేణి కార్మికుల హక్కుల కోసం పోరాటం చేసేది ఐఎన్‌టీయూసీయేనని ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ అన్నారు. ఆదివారం గోదావరిఖనిలోని ఒక ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఐఎన్‌టీయూసీ మహాసభ, పెద్దపల్లి పార్లమెంటరీ సన్నాహక సభ విజయవంతం చేసినందుకు నాయకులకు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు కార్మికవర్గం బుద్ధి చెప్పిందని, అదే విధంగా ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కూడా బుద్ధి చెప్పాలని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ వయోపరిమితి పరిష్కరించడం జరిగిందని, రిటైర్డ్ కార్మికుల పెన్షన్ పెంపుదలకు కృషి చేయడంతో పాటు పెర్క్స్‌పై కార్మికులు చెల్లించే ఐటీ యాజమాన్యం భరించే విధంగా మంత్రి శ్రీధర్‌బాబు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఐఎన్‌టీయూసీ సెంట్రల్ నాయకులు, బ్రాంచ్ నాయకులు, అన్నీ ఏరియాల వైస్ ప్రెసిడెంట్లు హాజరయ్యారు.

ఎన్నికల నిఘా నేత్రం

- కోడ్ అమలుకు 24 గంటల తనిఖీ బృందం
- అభ్యర్థుల ప్రచారం వెంటే ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనం
- కోడ్ ఉల్లంఘన జరిగితే 1950 కాల్ చేయాలి



సుల్తానాబాద్‌లో ఎన్నికల నిఘా నేత్రంతో కూడిన వాహనం

సుల్తానాబాద్, ఏప్రిల్ 21: ఎన్నికల కోడ్ అమలకు కమిషన్ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా కోడ్ అమలు పర్యవేక్షణ కోసం సీసీ కెమారాలను అమర్చిన వాహనాలను అందుబాటులో ఉంచారు. సుల్తానాబాద్ మండలంతో పాటు పలు మండలాల్లో ఈ వాహనాలను ఉపయోగించుకుంటున్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నిబంధనలను పాటించడం కోసం ఎన్నికల సంచార నిఘా వాహనాలను ఉయోగించుకుంటున్నారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో మూడు నిఘా వాహనాలను అందుబాటులో ఉంచుతూ ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎక్కడ ప్రచారం నిర్వహించినా వారి కదలికలను ఈ నిఘా నేత్రం రికార్డు చేస్తుంది. ఒక వాహనానికి సీసీ కెమెరాలను అమర్చి వాటిని నియోజకవర్గ వ్యాప్తంగా తిప్పుతున్నారు. సుల్తానాబాద్ మండలంలో ప్రత్యేకంగా ఒక నిఘా నేత్రంతో కూడిన వాహనం గ్రామాల్లో ఎన్నికల ప్రచార సరళిని, అభ్యర్థుల ప్రచార కార్యక్రమం, అందులో పాల్గొంటున్న వారి వివరాలను నమోదు చేస్తున్నారు. అభ్యర్థులు రోజు వారి ఖర్చులను కూడా ఈ బృందం నమోదు చేస్తూ ఎప్పటికప్పుడు ఏ రోజుకారోజు వివరాలను ఆర్డీవో కార్యాలయానికి సమర్పిస్తున్నారు. ఈ ఫ్లైయింగ్ స్క్వాడ్ వాహనంలో ఒక ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ అధికారి, పోలీస్ అధికారి, ఒక విడియో గ్రాఫర్ ఉంటారు. వీరు అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని అన్ని గ్రామాలను మండల కేంద్రాలను పర్యటిస్తూ ఎక్కడైతే ఎన్నికల నిబంధలను ఉల్లంఘించినట్లయితే వాటిని రికార్డు చేసి తమకు అనుసందానం చేసి ఉన్న జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి చేరవేస్తారు అలాగే రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి వచ్చిన ఫిర్యాదులను, జిల్లా ఎన్నికల అధికారి నుంచి వచ్చిన ఆదేశాల మేరకు, లేదా టోల్ ఫ్రీ నంబర్ 1950కు వచ్చిన సమాచారం ఆధారంగా వాహనాల తనిఖీలు కానీ సోదాలు కానీ చేస్తారు. వాహనాల్లో డబ్బులు తరలిస్తున్నారనే సమాచారం అందితే వెంటనే వాహనాల తనిఖీ చేసి వాటిని పట్టుకుంటారు.

అభ్యర్థుల ప్రచార సరళి రికార్డు

పార్లమెంట్ అభ్యర్థులు తమ ప్రచారాన్ని ఎక్కడ చేపట్టిన వారి వెంట ఈ నిఘా నేత్రం తో కూడిన ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం ఆరా తీస్తుందని, పైగా వారి ప్రచార సరళిని రికార్డు చేయడం జరుగుతుందని ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం అధికారి సతీష్ తెలిపారు. ఆయా పార్టీ అభ్యర్థులు తమ ప్రచారంలో ఎన్ని వాహనాలు వినియోగిస్తున్నారు.ఎంతమంది పాల్గొంటున్నారు. వారు ఉపయోగిస్తున్న ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోవడంతో పాటు ముఖ్యంగా ఎన్నికల నిబంధలను ఉల్లంఘించిన వాటిని వెంటనే ఉన్నతాధికారులకు చేరవేస్తామన్నారు. వాహనాల తనిఖీ చేసిన సందర్భంలో అక్రమంగా డబ్బులు మద్యం వంటివి రవాణా అవుతుంటే వాటిని సీజ్ చేస్తామన్నారు. ప్రధానంగా మోడల్ కోడ్ అమలు కఠినంగా అమలుచేయడమేనన్నారు. ఎన్నికల్లో భాగంగా ఎక్కడా డబ్బులు మద్యం పంపిణీ జరగకుండా చూస్తామన్నారు. టోల్ ఫ్రీ 1950 ద్వారా సమాచారం ఇచ్చినా, సీవిజిల్ ఆప్ ద్వారా ఫిర్యాదులు చేయవచ్చన్నారు.

సదాశివ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 21: సదాశివ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. 11 రోజుల క్రితం సదాశివ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని పందిళ్ళ గ్రామానికి చెందిన ఇల్లందుల శాంతయ్య మృతిచెందగా వారి కుటుంబ సభ్యులు సదాశివ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శాంతయ్య మృతదేహాన్ని కరీంనగర్ ప్రతిమ మెడికల్ కళాశాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆదివారం సదాశివ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పందిళ్ళలో మృతుని కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే శాలువాలతో సన్మానించి మెమెంటో అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓదెల మండల కేంద్రానికి చెందిన సదాశివ ఫౌండేషన్ 2008నుంచి నేత్రదానం, శరీరదానం విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ వరంగల్, పెద్దపెల్లి జిల్లాల్లో వృత్తుల కుటుంబ సభ్యుల సహకారంతో నేత్రాలు, మృత శరీరాలను ప్రభుత్వ వైద్యశాలలకు అప్పగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, సదాశివ ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి మెరుగు భీష్మాచారి, ఎంపీటీసీ రావి సదానందం, మాజీ సర్పంచ్ ఆటికమ్ శంకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, నాయకులు మాదాసు సతీష్, సబ్బని రాజమల్లు, పోతర వేన మహేందర్ పాల్గొన్నారు.



మృతుడి కుటుంబ సభ్యులకు మెమొంటో అందజేస్తున్న ఎమ్మెల్యే

కాంగ్రెస్ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 21: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పిలుపునిచ్చారు. ఆదివారం అంతర్గాంకు చెందిన హన్మన్‌రెడ్డి ఆధ్వర్యంలో పొట్యాల మాజీ సర్పంచ్ ఎదులాపురం నీరజవెంకటేష్ వంద మంది అనుచరులతో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి మక్కాన్‌సింగ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అని, ప్రజల కష్టాలను తీర్చేది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయడం జరిగిందని, మరిన్ని పథకాలను కూడా అమలు చేయనున్నట్టు ఆయన చెప్పారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీని భారీమెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీహరి, కొత్తపల్లి రాజు, పెంద్యాల మహేష్, గాదె సుధాకర్, మద్ది తిరుపతి, బరుపటి శ్రీనివాస్, సింగం కిరణ్, సంతోష్ పాల్గొన్నారు.

'లోన్ యాప్‌లను నిషేధించాలి'

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 21: క్షణాల్లో రుణాలిస్తామంటూ అప్పుల ఊబిలోకి నెట్టి రుణగ్రహీతల మానప్రాణాలతో చెలగాటమాడుతున్న లోన్‌యాప్‌లను నిషేధించాలని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆన్‌లైన్ నుంచి రుణాలు అందించే వారికి ఆర్‌బీఐ నిబంధనలు వర్తిస్తాయన్నారు. ఇటీవల దేశంలో వివిధ రాష్ట్రాలలో యాప్‌ల ద్వారా అనేక మందికి నగదు రుణాలు తీసుకొని వాటిని తిరిగి చెల్లించే క్రమంలో సంబంధిత యాప్ యాజమాన్యాలు చేసే వేధింపులు భరించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అందులో యువత, మధ్య తరగతి ప్రజలు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌బీఐ చట్టం ప్రకారం 1934లోని సెక్షన్ 45-1 ఎన్‌బీఎఫ్‌లకు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలని తగిన రిజిస్ట్రేషన్ అనంతరమే నిబంధనల మేరకు పనిచేయాలని పేర్కొన్నారు.

ఎల్లమ్మ కొలుపు

ఓదెల, ఏప్రిల్ 21: మండలంలోని జీలకుంటలో ఆదివారం గౌడ కులస్థులకు ఇలవేల్పు అయిన రేణుక ఎల్లమ్మ తల్లిని కొలుపును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లమ్మ పట్నాల మహోత్సవంలో భాగంగా పోచమ్మ తల్లికి బోనాలను సమర్పించారు. అనంతరం బీజేపి రాష్ట్ర నాయకులు ఏగోలపు సదయ్యగౌడ్, గౌడ కులస్థులు పోచమ్మ, ఎల్లమ్మకు బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా కార్యదర్శి పుల్లూరి పృథ్వీరాజ్, అగ్గి శ్రీనివాస్, చర్లపల్లి రాజు, బంగారి సారయ్య, సిరిసెటి రమేష్‌తో పాటు గౌడ కుల పెద్దలు , యువకులు, మహిళలు పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా మహేష్‌గౌడ్

సుల్తానాబాద్, ఏప్రిల్ 21: సుల్తానాబాద్ మండల బీజేపీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు గా సీనియర్ బీసీ నాయకులు వడ్లకొండ మహేష్ గౌడ్‌ను నియమించినట్టు మండల బీజేపీ అధ్యక్షులు వేల్పుల రాజన్న పటేల్ ఒక ప్రకటనలతో తెలిపారు. సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి గ్రామానికి చెందిన మహేష్ గౌడ్ ఏడేళ్లుగా బీజేపీలో వివిధ విభాగాలలో పని చేస్తున్నారని ఆయన సేవలు గుర్తించి మండల ఓబీసీ మోర్చా అధ్యక్షులుగా నియమించినట్లు రాజన్న పటేల్ తెలిపారు.

'మోదీని మళ్లీ ప్రధానిగా చేయడమే ప్రతి కార్యకర్త లక్ష్యం'

సుల్తానాబాద్, ఏప్రిల్ 21: ప్రధాని నరేంద్రమోదీని మూడోసారి దేశ ప్రధానిగా చేయడమే ప్రతీ బీజేపీ కార్యకర్త లక్ష్యంగా పని చేయాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి గ్రామంలో వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ ను గెలిపించి మరోసారి నరేంద్ర మోదీని ప్రధాన మంత్రిని చేయాలని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇంటింటికి తిరుగుతు వారు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో బీజేపీ నాయకులు మహేష్ గౌడ్,జెట్టి శ్రీనివాస్, గున్నాల ప్రవీణ్, శ్రావణ్, అనిల్, సతీష్, ప్రవీణ్,మహేష్, అశోక్, రాజు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి'

ధర్మారం, ఏప్రిల్21: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థుల గెలుపునకు కాంగ్రెస్ సేవాదళ్ కార్యకర్తలు కలసికట్టుగా పని చేయాలని కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు బొల్లి స్వామి కోరారు. ఆదివారం ధర్మారంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో సేవాదళ్ క్రియాశీలక పాత్ర పోషించి క్షేత్ర స్థాయిలో పోలింగ్ బూతుల వారీగా ప్రచార ప్రణాళికలను రూపొందించుకోవాలని ఆయన చెప్పారు. పెద్దపల్లి ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణ గెలుపు కోసం గ్రామ స్థాయిలో ప్రతి కార్యకర్త సమన్వయంలో పని చేయాలని ఆయన కోరారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఎలా గెలుపించుకున్నామో అదే తీరుగా ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం కష్టపడి పని చేయాలని ఆయన కోరారు.

గీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా సదయ్య

సుల్తానాబాద్, ఏప్రిల్ 21: సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుల్తానాబాద్ మండలం తొగర్రాయి గ్రామానికి చెందిన జొంగోని సదయ్య గౌడ్‌ను నియమించినట్లు రాష్ట్ర ఆధ్యక్షులు కోడూరి పర్శరామ్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జొంగోని సదయ్య గౌడ్ మాట్లాడుతు జిల్లాలో గీత కార్మికులు ఎదురుకుంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి

ఎలిగేడు, ఏప్రిల్ 21: పార్లమెంట్ ఎన్నికల ప్రచారసభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ యువజన మండల కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడుతూ మే 13న జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని కనివిని ఎరుగని మెజార్టీతో గెలుపించుకోవాలని అందుకు అనుగుణంగా ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలన్నారు. సోమవారం ఎలిగేడులోని మధుర ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 11.30కి జరగబోయే ఎన్నికల ప్రచారసభకు ఎమ్మెల్యే విజయరమణారావు పాల్గొంటారని వారు పేర్కొన్నారు.

రహదారి పనులతో విద్యుత్ సరఫరాకు అంతరాయం



విద్యుత్ వైర్లకు కర్రను ఏర్పాటు చేసి ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 21: మండలంలోని పెద్దబొంకూర్ నుంచి కొత్తపల్లి వరకు నిర్మిస్తున్న రహదారి నిర్మాణంతో దస్తగిరిపల్లి గ్రామానికి విద్యుత్ సమస్య తలెత్తుతోందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ రోడ్డు వెడల్పు చేస్తున్న క్రమంలో భాగంగా విద్యుత్ స్థంభాలు తొలగించకుండా అలాగే ఉంచడంతో రహదారి ఎత్తుగా కావడంతో విద్యుత్ స్థంభాల వైర్లు కిందికి వేలాడుతున్నాయి. దీంతో భారీ వాహనాలు వచ్చినప్పుడు వైర్లు తెగిపడి ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో మిట్టపల్లి శ్రీనివాస్, బూర్ల కొమురయ్య, మొగుసాల అశోక్‌రెడ్డి, చిట్టవేన వినోద్, భైరీ సత్తయ్య, కొండి రవి, మల్లేశం, సత్యనారాయణరెడ్డి, రాజయ్య, కుమార్, సాగర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.